# సుబ్బారావు - సూర్యకాంతి

ఒక్క ముక్కలో చెప్పాలంటే సూర్యకాంతి, సుబ్బారావుల నాలుగు కళ్ళూ ఏకకాలంలో కలుసుకుని, రెండుగా మారిపోయి, ఒకరి కళ్ళలో ఇంకొకరి కళ్ళు గుచ్చుకొని, ఆ కళ్ళముళ్ళు అలా అలా హృదయాల్లోకి వెళ్ళి రెండు హృదయాల్నీ ఒక్కటిగా చేసేశాయి. 'ఆహా! ఏమి నా అదృష్టం! తొలిచూపులోనే వలచగలిగితినే' అనుకున్నాడు సుబ్బారావు – తస్కరించబడిన గుండె దగ్గర తడువుకుంటూ. ''భాగ్యమంటే నాదే గదా! ఈ అబ్బాయి పొట్లకాయలా పొడుగ్గా వున్నా, వంగపండులా బావున్నాడు. నా కళ్ళలోకి చూశాడంటే, నన్ను ప్రేమించాడు!'' అనుకుంది సూర్యకాంతి. వాళ్ళ కళ్ళూ హృదయాలూ వెనక నుంచి వాళ్ళని అలా అలా మెల్లిగా ముందుకు నెట్టాయి. ఇద్దరూ ఇంకో ఆరంగుళాల్లో ఢీ కొంటారనగా, సడెన్ బ్రేకులు వేసి ఇద్దర్నీ ఆపేశాయి!

''...నీ...నీ..మీ...మీ...పేరు?'' అని అడిగాడు సుబ్బారావు – ''ఇది నత్తికాదు- తడబాటు'' అని కంగారుగా చెబుతూ.

''సూ...సు...సూర్యకాంతి...'' అందా అమ్మాయి 'చూశావా, నాకూ నీ జబ్బే' అన్నట్టుచూసి. ''నా పేరు సుబ్బారావు. ఇది తల్లిదండ్రులు పెట్టిన పేరనుకో. బాగాలేదు, నాకు తెలుసు. మార్చేస్తాను - నీ ఆజ్ఞయితే'' అన్నాడు సుబ్బారావు. సూర్యకాంతి పళ్ళు కనిపించకుండా, కళ్ళతో నవ్వింది. సుబ్బారావు కనుబొమలు ఆనందంగా పైకెగిరి, నుదుటి మీద జుట్టును తాకాయి. సూర్యకాంతి పెదవులు ఏం చెప్పాలనో, చెయ్యాలనో, చిరుగాలికి చిగురుటాకులు వణికినట్టు వణికాయి. ''మనల్ని ఎవరూ విడదీయలేరు సూర్యకాంతీ!'' అన్నాడు సుబ్బారావు గంభీర స్వరంతో. 'అలాగే' అన్నట్టు ముంగురులు అల్లల్లాడేలా తల ఆడించింది సూర్యకాంతి.

నాటినుంచి సుబ్బారావు సూర్యకాంతులు కలల మీద కలలు గంటూ, ఆకలి దప్పులు మరచిపోతూ, వీలున్నప్పుడు అక్కడా అప్పుడూ కలిసి ప్రేమ కబుర్లు

చెప్పుకుంటూ, కలిసినప్పుడు యుగాలు క్షణాలుగా, కలవనప్పుడు క్షణాలు యుగాలుగా గడువుతూ రోజులు గడుపుతున్నారు.

సూర్యకాంతి – తనకి సుబ్బారావుని పెళ్ళాడాలని వుందన్న విషయం తలిదండ్రు లకి చెప్పాలంటే భయం, సిగ్గు. సుబ్బారావుకి తండ్రిలేడు గనక, సిగ్గులేదుకాని, తల్లి దగ్గర చెప్పడానికి భయం. ఎంచేతంటే అతనికి ఓ పిల్ల అంతకు ముందే పెళ్ళికి నిర్ణయమైవుంది. ఆ పిల్ల అతని మేనత్త కూతురు. కానీ, సుబ్బారావుకి ఎవర్నయినా ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని ఆశ. ఒకవేళ ప్రేమించడానికి పిల్ల దొరక్కపోయినా, వీలు కలగకపోయినా తన ఆశని అంతరింప జేసుకుని ఈ మేనత్త కూతుర్ని చేసుకోవచ్చునని ఊరికే 'రిజర్వు'లో పెట్టుకున్నాడు. ఆ పిల్ల తల్లి మాత్రం తన కూతుర్ని అన్నగారి కొడుక్కిచ్చి చెయ్యాలనే ఎంతో ఆశతో వుంది. సుబ్బారావు దృష్టిలో ఆ మేనత్త కూతురు అందగత్తెకాదు - పైగా పెరటిచెట్టు. పేరుమాత్రం ఊర్వశేగాని, చూడ్డానికి అతని దృష్టిలో 'మేనక'లా కూడా వుండదు! సుబ్బారావు ఉద్యోగం పెర్మనెంట్ అవగానే ఊర్వశీ సుబ్బారావుల బంధుత్వం 'పెర్మనెంట్' అయిపోవాలని, ఉద్యోగం పెర్మనెంట్ కావడంలో కాలం ముదిరినా, వీళ్ళ వయసులు ముదరకుండా మూడు ముళ్ళూ పడిపోవాలనీ ఆ పెద్దల నిర్ణయం. ఈలోగా సూర్యకాంతి కనిపించడం, సుబ్బారావు 'ప్రేమ ఆశ' చిగురించడం, ఆ చిగురు రెమ్మగా కొమ్మగా ఎదగడం – జరిగాయి.

''మీ తలిదండ్రులతో నేనొచ్చి మాట్లాడనా నా సూర్యకాంతీ!'' అని అడిగాడు సుబ్బారావు ఒక చల్లని సాయంకాలపు వేళ వూరవతల తూముగట్టు దగ్గర. అప్పుడే వద్దంది ఆ అమ్మాయి. తనకి సంబంధాలు ఇంకా చూడ్డంలేదని, చూడ్డం ఆరంభించినప్పుడు చూడక్కర్లేదని చెబుతూ ఈ విషయం తనే చెబుతాననీ అంది. ''అప్పుడైతే భయం, సిగ్గూ తగ్గుతాయి. చెప్పడానికి అనువుగా వుంటుంది'' అంది. అలాగే అనుకున్నాడు సుబ్బారావు. మరి, తానెప్పుడు చెప్పాలి ఇంట్లో? ఎలా చెప్పాలి? ఊర్వశికీ తనకీ పెళ్ళి అనుకుంటున్నప్పుడు చెప్పాలి.

''మరి, నీ విషయం సుబ్బారావ్?'' అని అడిగింది సూర్యకాంతి తలెత్తకుండా కళ్ళెత్తి చూస్తూ.

''నాకేం ఇబ్బందిలేదు. నా మాటకి నాయింట ఎదురు లేదు. కారణం – నాకు తండ్రిలేడు. మా తల్లికి నేనే ఆఖరివాడిని. ఆఖరివాడంటే అందరికీ ముద్దే. అందుకని నేనాడింది ఆట, పాడింది పాట'' అన్నాడు సుబ్బారావు మొహమంతా పళ్ళు చేసుకుని నవ్వుతూ. బంధించిన ఊపిరిని సూర్యకాంతి హాయిగా వొదిలింది.

''ఆ గువ్వల జంట చూశావా సూర్యకాంతీ?'' అన్నాడు సుబ్బారావు పరవశించిపోతూ.

''అది గువ్వల జంటకాదు. కాకులు!'' అంది సూర్యకాంతి.

''నా కంటికి ప్రపంచమంతా ప్రేమమయమే!'' అన్నాడు సుబ్బారావు.

''సుబ్బారావ్! ఈ సెలయేరు చూశావా? ఎంత అందంగా, ప్రశాంతంగా ప్రవహిస్తోందో'' అంది సూర్యకాంతి.

''ఇది సెలయేరుకాదు. మనం కూర్చున్న తూము గట్టు కిందనుంచి పారుతున్న మురికినీరు'' అన్నాడు సుబ్బారావు.

''ప్రపంచం అంతా నాకు ఆనందంగానే వుంది. సుబ్బా...'' అంది సూర్య. అప్పుడే కుంగి పోతున్నందుకు సూర్యుణ్ణి ఓసారి తిట్టుకుని, చీకటి పడక ముందే ఆడపిల్ల ఇల్లు చేరాలన్న పెద్దల రూలును గర్హించి, పిట్టలు రెండూ గూళ్ళకి బయల్దేరాయి.

ఇహ ఏమయితే అవుతుందని, ఓ సూర్యోదయ సమయంలో వీధి తలుపు తెరిచి, సూర్యకాంతి ఇంట్లోకి రాబోతున్నదని 'సింబాలిక్ సంభాషణ' వాడి, విషయం వివరించేశాడు సుబ్బారావు తల్లికి.

''ఇదేం పస్రా? ఊర్వశి వుండగా...'' అంది ఆమె.

''ఊర్వశి నాకొద్దు''

''ఆ మాట ఇప్పుడంటే ఎలా?''

''చేసుకుంటానని నేనెన్నడూ ప్రమాణం చెయ్యలేదు''

''వాళ్ళు నీ మీద ఆశలు పెట్టుక్కూర్చున్నారే''

''అది వాళ్ళ తప్పు. నిరాశ చేసుకుని నించోమను'' అలా ఇద్దరూ ఘర్షణ పడిన తర్వాత సుబ్బారావు తల్లి అంది :

''నాకేం తెలీదురా, వెళ్ళి మీ అత్తతో చెప్పు''

''నువ్వు ఒప్పుకున్నాక అత్తతో చెప్పడం ఎంతసేపు?'' అని సుబ్బారావు అవతలి వీధిలోనే వుంటున్న అత్తదగ్గరికి వెళ్ళాడు. సుబ్బారావు రాక చూసి, కూరగాయలు

తరుగుతున్న ఊర్వశి ఛట్టున లేచి, కంగారులో కత్తిపీట తంతే, ఆ కత్తిపీట కూరగాయల్ని ఫుట్‌బాల్ ఆడితే, ఆ అలజడికి సుబ్బారావు ఈ గదిలోకి, ఊర్వశి వంటింట్లోకీ పరుగెత్తారు.

అత్త తెచ్చిన ''చేదు'' కాఫీని పీల్చలేక పీలుస్తూ కథంతా చెప్పి ''ఇది అత్తా సంగతి, ఇంతే'' అన్నాడు సుబ్బారావు. అత్త విస్తుపోయింది. అత్త వెనకగా తలుపుకి ఆనుకుని వున్న ఊర్వశి కాలు పట్టుతప్పి కిందికి జారిపోయింది. అత్త కళ్ళలో నీళ్ళు తిరిగితే – ఊర్వశి కాటుక చెదిరిపోయింది.

''నీ యిష్టం బాబూ-అనవేం అత్తా?'' అని నిలవేసి అడిగాడు సుబ్బారావు-లేచి నిలబడి.

''నీ యిష్టం ఎలా కుదుర్తుంది? మీ అమ్మతో మాట్లాడతాను'' అంది అత్త.

''అమ్మ నీతో మాట్లాడమంది''

''నేనే అమ్మతో మాట్లాడతాను'' అని ఆమె బయల్దేరింది. ''నేనెవరితో మాట్లాడాలి?'' అనుకుంది ఊర్వశి పైన నిదానంగా తిరుగుతున్న ఫాన్ వేపు చూస్తూ.

సుబ్బారావు తల్లీ, అత్తా మాట్లాడుకున్నారు. అంతకు మునుపు వాళ్ళు అనుకున్న మాటలు, చేసుకున్న బాసలూ చెప్పుకున్నారు. సుబ్బారావుని కూచోబెట్టి ఆ విషయాలన్నీ చెప్పి-ఆ పిల్ల సంగతి మరిచిపోమనీ, ఊర్వశినే చేసుకోమనీ గట్టిగా చెప్పారు. సుబ్బారావు ఒప్పుకోలేదు. బుంగమొహం పెట్టాడు. ముందు నల్లరంగులో వున్న ఆ బుంగ తర్వాత ఎర్రగా మారింది.

''కుదరదు! కుదరదు!'' అన్నాడు సుబ్బారావు లేచి. ''ప్రేమికుల్ని వేరు చెయ్యకండి. మీరు బాగుపడరు. ప్రేమ అజరామరమైనది. ప్రేమకి జాతి మత భేదాలు లేవు. బీద, గొప్పలు లేవు. ప్రపంచానికి అతీతమైనది ప్రేమ!'' అని ఉపన్యాసం ఇచ్చాడు. ఇచ్చి, ఠీవిగా నిష్క్రమించబోయాడు.

''ఆగురా! ఎక్కడికి వెళ్ళిపోతావు? నీ యిష్టం వచ్చినట్టు ఆ పిల్లని ప్రేమించావంటే, మేము ఎందుకు ఒప్పుకోవాలి? మేము పెట్టుకున్న నమ్మకాల్ని వమ్ముచేసి ఎక్కడికి పోతావు? ఈ మాట ఎప్పుడో చెప్పేయొచ్చుగా. పెళ్ళికి ముహూర్తాలు చూడాలి అని, అత్త ఎప్పట్నుంచో అంటూ వుంటే, ఇప్పుడొచ్చి ఈ మాట చెప్పావేం?'' అని గసిరింది తల్లి.

''ఊర్వశిని ప్రేమిస్తున్నాననీ, పెళ్ళి చేసుకుంటాననీ నేను ఎన్నడూ చెప్పలేదు. మీరు అనుకున్నారుగాని, నేను అనలేదు'' అన్నాడు సుబ్బారావు గొంతుస్థాయి హెచ్చించి.

''నీతో వేరే అనాలా బాబూ! ఎప్పుడో అనుకున్నదేగా! మీ మామయ్యగారు బతికివున్న రోజుల్నుంచీ అనుకుంటున్న మాటే. పైగా ఆయన పోతూ పోతూ మీ అమ్మదగ్గర మాట తీసుకుని మరీ వెళ్ళిపోయారు. అమ్మ మాట ఇచ్చింది. ఈ భరోసాలన్నీ ఉన్నాయనే నేను ఊర్వశికి ఎక్కడా సంబంధం వెతకలేదు – చూడలేదు. ఇప్పుడు నువ్వు కాదని కొట్టి పారేస్తే కుర్రాళ్ళకోసం నేనెక్కడ పరుగెత్తేది?'' అంది అత్త సగం దుఃఖంతో.

సుబ్బారావు మెదడులో ఐదారు వందల ఎలక్ట్రిక్ బల్బులు ఒక్కసారి జిగ్‌మని వెలిగాయి. అతని కళ్ళు జిగేల్మన్నాయి. ''ఐడియా'' అంది మనసు.

''అయితే అత్తా-ఒకటి చేస్తాను. ఊర్వశికి సంబంధం నేను చూస్తాను. మామయ్య బాధ్యత, అమ్మ ఇచ్చిన మాటా నేను నా నెత్తిన వేసుకుంటాను. తిరిగి తిరిగి మంచి సంబంధం తెస్తాను. అప్పుడు నీకు బాధ వుండదుగా. అమ్మ మాటకి భంగం రాదుగా'' అన్నాడు ఆనందంగా.

''అదెలా కుదుర్తుందిరా? ఐన సంబంధానికీ, కాని సంబంధానికీ తేడా లేదూ? పిచ్చి ఆలోచన'' అని తల్లి కొట్టి పారేసింది.

''అమ్మా! ఒకటి మాత్రం నిశ్చయం. నేను సూర్యకాంతిని వొదులుకోలేను. ఊర్వశిని నువ్వు వొదులుకోలేవు. ఇద్దర్నీ చేసుకోడానికి చట్టం అనుమతించదు. అనుమతించినా ఇద్దర్నీ నేను చేసుకోలేను. ఊర్వశిమీద ఎన్నడూ నాకు ప్రేమ లేదు, మనసూ లేదు. అత్త నన్ను నమ్ముకుని ఇన్నాళ్ళూ ఏ ప్రయత్నమూ చేయకుండా వుండి పోయింది గనక, దానికి పరిహారంగా నేను అబ్బాయిల వేట ఆరంభిస్తాను. మంచి సంబంధం అనిపిస్తేనే చేసుకోండి. నాకేం పెట్టాలనుకున్నారో, అవే ఆ సంబంధానికీ పెట్టండి. అంతకంటె నేనేం చెప్పలేను'' అన్నాడు సుబ్బారావు.

''అంతా దాని కర్మ! దాని రాత ఎలా వుంటే అలా జరుగుతుంది. మన చేతిలో ఏముంది?'' అంది అత్త నిరాశగా. అత్తని సగం దారికి తీసుకురాగలిగినందుకు సుబ్బారావు సంతోషించాడు.

''నీకేం భయం అక్కర్లేదత్తా. నాకూ పెద్దలమాటల మీద గౌరవం, భక్తీ వున్నాయి. మంచి చెడ్డలూ, సెంటిమెంట్లూ నాకూ తెలుసు. ఊర్వశికి సంబంధం

చూస్తాను. చూడ్డమే కాదు దగ్గరుండి పెళ్ళి జరిపిస్తాను. జరిపించడమే కాదు ఊర్వశి పెళ్ళి అయిన తర్వాతనే నేను పెళ్ళి చేసుకుంటాను. సరేనా?'' అని అత్త చేతిలో చెయ్యివేసి, పెళ్ళి కొడుకుల కోసం చెప్పులు అరిగేలా తిరుగుతాననీ, తొడుక్కున్న బూట్లు విప్పేసి, చెప్పులు వేసుకుని బయల్దేరాడు సుబ్బారావు.

సుబ్బారావుకి స్నేహితులు బోలెడుమంది. అందులో కొందరు మంచివాళ్ళూ వున్నారు. కొందరు మహా మంచివాళ్ళూ వున్నారు. మహామంచి వాళ్ళలో పెళ్ళికాని వాళ్ళ పేర్లు రాసుకుంటూ బయల్దేరాడు.

ఒకడు-''నేనసలు పెళ్ళే చేసుకోను. పెళ్ళి అనర్థాలకి మూలం. సంసార లంపటంలో పడ్డం నాకిష్టంలేదు. ముందు పెళ్ళాం వస్తుంది. తర్వాత పిల్లలు వస్తారు. వాళ్ళకి పాలడబ్బాలు, మందులు, స్కూళ్ళలో సీట్లు, డొనేషన్లు, తిరుగుళ్ళూ-ఇవన్నీ నేను పడలేను. 'బ్రహ్మచారీ శత మర్కటః' అన్నారు. వెయ్యి కోతుల పెట్టయి చెట్టుమీద ఎగుర్తూ తిరుగుతాను గాని, పెళ్ళి మాత్రం చేసుకోను'' అని కచ్చితంగా చెప్పేశాడు.

ఇంకోడు-''తల్లీ దండ్రీ కని పెంచే దైవాలు, కనిపించే దైవాలు. వాళ్ళు లేకపోతే నేను లేను. నా తల్లి నన్ను నవమాసాలూ మోసింది. పాలిచ్చి పెంచింది, పెద్ద చేసింది. తండ్రి చదివించాడు. తల్లి గారాబంగా చూసుకుంది. 'తల్లిని మించిన దైవము వేరే ధారుణి లేదోయి' అన్నారని మా నాన్న అంటారు. అదేదో వెనకటి సినిమాలో పాటట. ఆ సినిమా కూడా గొప్పదేట. అసలు ఇప్పుడొస్తున్న సినిమాలకీ, ఆనాటి సినిమాలకీ'' అని ఇంకా చెప్పబోతూ వుంటే, 'థాంక్స్' అని కదిలాడు సుబ్బారావు.

దార్లో ఓ దేవాలయం కనిపిస్తే సుబ్బారావు దండం పెట్టుకున్నాడు. ''స్వామీ! త్వరగా మా ఊర్వశి పెళ్ళి కుదిరేలా చెయ్యి స్వామీ మాట ఇచ్చి వచ్చాను. ఈ పెళ్ళి కుదిర్తేగాని, నా పెళ్ళి కుదరదు. రెండు పెళ్ళిళ్ళూ ఒకే ముహూర్తంలో కుదిరేలాగా చేస్తివా – రెండు జంటలం నీ దగ్గరకొచ్చి అర్చనలు చేస్తాం'' అని నమస్కరించి, కళ్ళు తెరిచాడు.

''అరె! ఆంజనేయస్వామి! బ్రహ్మచారికా నేను దణ్ణం పెట్టుకున్నాను- సరిపోయింది!'' అనుకుని నీరసంగా కదిలాడు సుబ్బారావు.

తన కోసం కలలు గంటున్న సూర్యకాంతికి విషయం చెప్పాడు. ''ఈ ప్రతిజ్ఞ నెరవేరాలి సూర్యా! మా అమ్మ మా మామయ్య కిచ్చిన మాటని ఈ విధంగా నిలబెడతాను. ఈ మహాయజ్ఞం నిర్వహణలో నేను నీకు కనిపించడం ఆలస్యమైతే అన్యధా భావించకు. అనునిత్యం నీ హృదయంలోనే వున్నవాడిని- చూడాలనిపించి

నపుడు నన్ను తలుచుకో. ఎక్స్‌రే కళ్ళతో హృదయంలో చూడగలుగుతావు. వస్తాను సూర్యా! నా ప్రయత్నాలు తొందరగా ఫలించాలని నన్ను ఆశీర్వ---తప్పుకాబోలు! నన్ను... ఇంగ్లీషులో అయితే ఈజీగా వుంటుంది. నన్ను విష్ చెయ్యి. వస్తాను సూర్యా వస్తాను!'' అని కత్తిమీద చెయ్యి వేసి, యుద్ధానికి బయల్దేరే రాకుమారుడల్లే స్కూటరు గుర్రం ఎక్కి దౌడుతీశాడు.

స్కూటరు మీద తిరుగుతూ వుండడంతో సుబ్బారావు చెప్పులు అరగడం లేదు. ''ఎలాగైనా నా చెప్పులు అరగాలి! నేనింకా తిరగాలి! నా ఊర్వశి ఇంకో ఇంటికి జరగాలి!'' అని కవిత్వం చెప్పుకుని మరో ఆరుగుర్ని చూశాడు సుబ్బారావు.

ఒకడు కట్నం అడిగాడు. ఒకడు కానుకలు చెల్లించమన్నాడు. ఒకడు కుదరదన్నాడు. ఒకడు వద్దన్నాడు. చివరికి ఒకడు కుదిరాడు. అతను విషయం అంతా విని -

''సుబ్బారావ్! ఒక మిత్రుడికోసం, అతని ప్రేమ జయించడం కోసం నేనీ పెళ్ళికి ఒప్పుకుంటాను. నాకు కట్నం వద్దు-కానుకా వద్దు. ఆ అమ్మాయి అందవిహీనురాలైనా సరే, నీకోసం అంగీకరించి, నా జీవితం త్యాగం చేస్తాను. నా తలిదండ్రులు అంగీకరించకపోతే, వాళ్ళనీ త్యాగం చేస్తాను. నీకోసం, నీ మైత్రికోసం త్యాగం చెయ్యడానికి నాకు అవకాశం కల్పించావు. అంతకంటె ఈ జన్మకి సార్థకత ఏముంది? పద-ఆ అమ్మాయి దగ్గరకెళ్ళి మాట్లాడదాం'' అని ముందంజ వేశాడు.

''ఆహా! త్యాగశీలా! మిత్రుడంటే నువ్వురా మిత్రుడివి. స్నేహ ధర్మం అంటే ఎలాంటిదో లోకానికి చాటావు. స్నేహానికి మారుపేరై నీవు కలకాలం వర్థిల్లుదువుగాక!'' అని అభినందించి, అతన్ని అత్త దగ్గరికి తీసుకెళ్ళి, కులం కాకపోయినా గుణం గొప్పదని, కట్నం అక్కర్లేకపోయినా చిరుకానుక చాలనీ, తలిదండ్రులు ఒప్పుకోక పోయినా అన్నదమ్ముల్ని ఒప్పించి, కావాలంటే ఇల్లరికం కూడా ఉండగలడనీ చెప్పాడు సుబ్బారావు. ఆ అబ్బాయి కూడా ఆ మాటలే మరోసారి గట్టిగా చెప్పాడు. ఉద్యోగం చేస్తున్న వాడే గనక, ఊర్వశిని చూసుకోగలడని నమ్మి, ఊర్వశిని పిల్చింది. ఒకర్నొకరు చూసుకున్నారు. సరే అంటే సరే అనుకున్నారు. ''సుబ్బారావ్, నీకోసం ఈ త్యాగం చేస్తున్నాను సుబ్బారావ్'' అన్నాడా కుర్రాడు మరోసారి. అయితే, అతని తలిదండ్రుల్ని త్యాగం చేసుకోవలసిన అవసరం అతనికి కలగలేదు. వాళ్ళూ ఈ పెళ్ళికి ఒప్పుకున్నారు – కొడుకు ఒప్పుకున్నాడుగదా అని. దగ్గర్లో ముహూర్తాలుంటే చూడమని కూడా అన్నారు.

సుబ్బారావు ప్రపంచాన్ని జయించిన చక్రవర్తి సింహాసనం ఎక్కి కూచున్నంతగా ఆనందపడిపోయాడు. తను సాధించాడు! అన్నమాట నిలబెట్టుకున్నాడు. ఆ

పండిట్లోనే ఆ ముహూర్తానికే తనూ సూర్యకాంతి మెడలో తాళి కట్టాలి. సుబ్బారావు విమానం మీద ఎగిరి సూర్యకాంతి ముందు వాలాడు. ''సక్సెస్ సక్సెస్'' అని అరిచి, జరిగిన కథంతా వివరించి, తన ప్రతిభ, ప్రజ్ఞ చాటాడు.

''నేనేనా తక్కువదాన్ని? ఏ శ్రమా పడకుండా నా తలితండ్రుల్ని ఒప్పించగలను'' అంది సూర్యకాంతి.

''తొందరగా కానీ, వాళ్ళు ముహూర్తం పెట్టేసుకున్నారు. లేదంటే మనం వెనక బడిపోతాం!'' అన్నాడు సుబ్బారావు.

ఆ రాత్రే సూర్యకాంతి తన ప్రేమ కథని ముందుగా తల్లితో చెప్పింది. ఆ తల్లి ఆ కథని అలాగే తీసుకెళ్ళి భర్తతో చెప్పింది. ఆ తండ్రి కూతుర్ని అలాగే తీసుకెళ్ళి గదిలో పెట్టి తాళం వేశాడు.

''నోర్ముయ్! సిగ్గులేకుండా ఇంకా ఏడుస్తున్నావ్! వాడిపేరు సుబ్బారావా! వాడికీ నీకూ ప్రేమా? అవతల నీకు నిక్షేపంలాంటి సంబంధం సిద్ధంగా వుంది. పెళ్ళి అవుతూనే నువ్వు అమెరికా వెళ్ళిపోతావు. మనం శ్రీమంతులం అన్నమాట మరిచిపోయి, టెంపరరీ ఉద్యోగంలో పడి ఏడుస్తున్న సుబ్బారావుని ప్రేమిస్తావా! ప్రేమిస్తే ప్రేమించావు-పెళ్ళి చేసుకుంటానంటావా! వీల్లేదు. బలవంతంగానైనా సరే, ఆ అమెరికా అబ్బాయి చేత్తోనే నీ మెడలో మూడు కాదు ముప్పై ముళ్ళు వేయించేస్తాను'' అని తండ్రి గట్టిగా కోప్పడ్డాడు. 'అమ్మా అమ్మా' అనీ, 'నాన్నా నాన్నా' అనీ ఏడ్చింది సూర్యకాంతి. ''నేను ఆత్మహత్య చేసుకుంటాను. నాకు సుబ్బారావే కావాలి! నాకు సుబ్బారావే కావాలి!'' అని గట్టిగా అరిచింది. ఆమె అరుపులకి ఎవ్వరూ చలించలేదు. ఆలస్యం చేస్తే లాభంలేదని, అమెరికా అబ్బాయికి ఈ విషయం తెలియక ముందే ముహూర్తం పెట్టేయాలనీ అతని తలిదండ్రులతో మాట్లాడారు సూర్యకాంతి తలిదండ్రులు. అమ్మాయి ఫోటోలు అబ్బాయి చూశాడు గనక, మాతా పితల మాట జవదాటనివాడు గనక, ముహూర్తం పెట్టేయొచ్చు అనుకున్నారు.

బందిఖానాలో వుండిపోయి సూర్యకాంతి కనిపించకపోవడంతో తికమకపడి పోయిన సుబ్బారావుకి అసలు విషయం తెలిసింది. ''సూర్యకాంతీ! నా సూర్యా!'' అని గగ్గోలు పెట్టాడు. ఆమె తలిదండ్రుల్ని శపించాడు. ఈ పెళ్ళి ఎలా చేస్తారో చూస్తానని బెదిరించాడు.

''విషయాలన్నీ ముందే చూసుకోకుండా ఇప్పుడెందుకు ఏడుస్తావురా? పెద్దవాళ్ళతో సంబంధం పెట్టుకున్నావు. కుదుర్తుందో లేదో చూసుకోకుండా, నిక్షేపంలాంటి ఊర్వశిని వదిలేశావు. ఇప్పుడు చూడు-ఇదీ పోయింది, అదీ పోయింది!'' అంది సుబ్బారావు తల్లి.

''అది పోలేదమ్మా-పోదు! ఊర్వశికి పెళ్ళికొడుకుని సాధించినవాడిని నా పెళ్ళికూతుర్ని సాధించలేనా? సాధిస్తాను. సూర్యకాంతీ! నా సూర్యా!'' అంటూ పరుగెత్తాడు తల్లి పిలుస్తున్నా వినిపించుకోకుండా.

ఆ శ్రీమంతులు సూర్యకాంతిని కోటలో బంధించేశారు. సుబ్బారావు ఎంత అరిచి గీ పెట్టుకున్నా వాళ్ళు సూర్యకాంతిని చూడనివ్వలేదు.

''మళ్ళీ ఈ పక్కలకి వచ్చావంటే రౌడీలచేత తన్నిస్తాను. గూండాలచేత కొట్టిస్తాను. ఎనమండుగుర్ని మోటారు సైకిళ్ళమీద పంపి, నిన్ను చుట్టుముట్టి తొక్కిస్తాను. లారీని పంపి రోడ్డుమీద ఢీ కొట్టిస్తాను. చాలా! వెళ్ళు'' అని సూర్యకాంతి తండ్రి సుబ్బారావుని తోసిపారేశాడు. ''అసలు నా సూర్య ఎలా వుంది? ఆమె అభిప్రాయం ఏమిటి? ఒక్కసారి నన్ను తెలుసుకోనివ్వండి... ఏమిటీ అన్యాయం? ఈ మూర్ఖపు తండ్రిని శపించడానికి మునులెవ్వరూ లేరా? ఈ ఘోరాన్ని ఆపగలిగే దేశ నాయకుడే కరువైపోయాడా? ఈ అన్యాయాన్ని అరికట్టగలిగే న్యాయమూర్తులే ఈ దేశంలో లేరా?'' అంటూ పిచ్చెత్తినవాడిలా అరుస్తూవుంటే, ఊర్వశికి కాబోతున్న భర్త ఆదుకుని తన ఇంటికి తీసుకెళ్ళి ఉపచారం చేసి, కాఫీ ఇచ్చాడు.

''పోనీ ఊరుకో సుబ్బారావ్! ఆ శ్రీమంతుల పిల్ల ఇక దక్కేలా లేదు. పోనీ, ఊర్వశినే చేసేసుకో. ముహూర్తం సిద్ధంగా వున్నా, శుభలేఖలు అచ్చయిపోయి పంపడం జరిగిపోయినా, నీకోసం నేనీ త్యాగం చేస్తాను'' అన్నాడు మిత్రుడు.

''వద్దు త్యాగాలు ఇంక వద్దు. నాకోసం నువ్వు చేసిన త్యాగాన్ని ఉపసంహరించు కోకు. ఊర్వశిని పెళ్ళాడు. సూర్యకాంతీ...'' అన్నాడు సుబ్బారావు మళ్ళీ పరుగెత్తబోయి. అక్కడున్నవాళ్ళు అతన్ని ఆపి, ఇంటికి తీసుకెళ్ళారు.

సూర్యకాంతికి ముహూర్తం నిశ్చయమైంది. ఊర్వశి పెళ్ళి ముహూర్తమే అదీనూ. అది పెద్ద కల్యాణమంటపంలో, ఇది చిన్న పెళ్ళి పందిట్లో.

సుబ్బారావు గోల పెడుతున్నాడు. పెళ్ళిలోనైనా సూర్యకాంతిని చూడాలి. తాళికట్టేముందు ''ఆపండి'' అని అరిచి, ఒక్క ఉరుకున వెళ్ళి, ఆ పెళ్ళికొడుకునో తన్నుతన్ని, అతని చేతిలోని మంగళ సూత్రం లాక్కుని, తను కట్టేయాలి.

ఇటు ఈ పెళ్ళి...అటు ఆ పెళ్ళి...రెండు పెళ్ళిళ్ళ మధ్యన సుబ్బారావు... పందిట్లో బాజాలు మోగుతున్నాయి. కల్యాణ మంటపంలో బ్యాండు మేళాలు వినిపిస్తున్నాయి. సుబ్బారావులో నీరసం, నిస్పృహ వచ్చేశాయి. ఇహ లాభం లేదు. ఒక్కసారి సూర్యకాంతిని ఆ పెళ్ళికూతురు దుస్తుల్లో చూసి, తను శాలువా కప్పుకుని దూరంగా నిలుచుని, ఆమె మీద అక్షింతలు వెయ్యాలి...సుబ్బారావు గడ్డం తడుము కున్నాడు. మాసేవుంది. అక్కడ వాళ్ళు ఇస్తారో ఇవ్వరోనని, ఈ పందిటినుంచే ఇన్ని అక్షింతలు తీసుకుని బయల్దేరాడు.

''అదేమిట్రా మా పెళ్ళికి వుండకుండా అక్కడికి వెళ్తావా...నీకోసం త్యాగం చేసినవాడిని అభినందించవూ...అయిన వాళ్ళంతా ఇక్కడ వుండగా అక్కడి కెందుకురా...'' అన్నాడు పెళ్ళికొడుకు.

సుబ్బారావు ''హుహుహు...' అని విరాగిలా నవ్వాడు. అర్ధనిమీలిత నేత్రాలతో చూశాడు.

''నా సూర్యకాంతి నాకోసం చూస్తూ వుంటుందిరా. ఒక్కసారి వెళ్ళనీ, ఈ అక్షింతలు వేసేసి, ఇక్కడికొచ్చి నీతోనే వుంటాను. నేనెప్పుడూ నీ వాడినేగా. తానొకటి తలిస్తే దైవమొకటి తలుస్తుంది. రాసి పెట్టిన గీతని తుడవడం ఎవరివల్లా కాదు. నువ్వూ ఊర్వశీ చల్లగా వుండండి...ఇప్పుడే వస్తాను...'' అని సుబ్బారావు పైన శాలు వా కప్పుకుని బయల్దేరాడు. కల్యాణ మంటపం దేవేంద్ర భవనంలా వెలిగిపోతోంది. కార్లు...బస్సులు...లారీలు...టాక్సీలు...జనం...పోలీసులు...

కల్యాణ మంటపం సుబ్బారావుకి కొన్ని అడుగుల దూరంలో వుందనగా, ఇద్దరు రౌడీలు మీసాలు దువ్వుతూ లాటీలతో అతని మీదకొచ్చి ఎర్రగా చూశారు. సుబ్బారావు వెనక్కి తిరిగి చూడగా, మరో ఇద్దరు మీసాలు తిప్పుతూ ఇట్నుంచి వచ్చారు. ''మర్యాదగా పారిపో. అడుగు ముందుకు వేశావంటే, నీ ఎముకలు కూడా మి గలవు. తొందరగా పారిపో...హెహ్హెహ్హె...'' అన్నాడు తీవ్రంగా ఒక రౌడీ, సుబ్బారావు చెవిలో. ఇంకోడు 'వూ' అని గద్దించిన గద్దింపుకి, సుబ్బారావు గాలికి కొట్టుకు పోయిన కాయితంలా, శాలువా జారిపోయినా, గమనించకుండా పరుగెత్తాడు. ఆ పరుగు అతన్ని ఊర్వశి పెళ్ళి పందిట్లోకి తెచ్చి దించింది. అప్పుడే ''మాంగల్యం తంతు నానేనా...'' అని వినిపిస్తోంది. సుబ్బారావు గబగబా జుట్టు సరిచేసుకుని, ముఖంమీద చిరునవ్వు పులుముకుని, చేతిలో వున్న అక్షింతల్ని ఊర్వశి దంపతుల మీద జల్లి, వాళ్ళు నవ్వుతూ చూస్తూవుండగా, ఒక్కసారి ఏడుపు మొహం పెట్టాడు! □